ప్రజాశక్తి

బుధవారం 21 ఆగస్టు 2024 5 విజయనగరం



హజ్‌యాత్రకు దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం : హజ్ యాత్ర కోసం హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2025కు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదును ఈ నెల 13వ తేదీ నుంచి ప్రారంభించింది. సెప్టెంబర్ 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించాలని కేంద్ర హజ్ కమిటీ నిర్ణయించింది. హజ్ యాత్ర కోసం దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించనున్నారు. రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆ కమిటీ విజ్ఞప్తి చేసింది. ప్రతి యాత్రికుడు తన మెషిన్ రీడబుల్ ఇండియన్ ఇంటర్నేషనల్ పాస్‌పోర్ట్ వ్యాలిడిటీ హజ్ దరఖాస్తు ముగింపు తేదీకి ముందే జారీ చేసి ఉండాలని, 15.1.2026 వరకు చెల్లుబాటు అయ్యేలా చూసుకోవాలని పేర్కొంది. ఎంపికైన హజ్ యాత్రికులు మెడికల్ స్క్రీనింగ్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. www.hajcommittee.gov.in/ www.apstatehajcommittee.com లో ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలి. రాష్ట్ర హజ్ కమిటీ ద్వారా సహాయాన్ని వ్యక్తిగతంగా, టోల్ ఫ్రీ నెం.1800-4257873, 0866- 2471786 ద్వారా లేదా మెయిల్ ద్వారా : aphajcommittee@gmail.com.పొందవచ్చు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎస్ఎఫ్ఐ, డబ్ల్యుటిఎఫ్ ఆధ్వర్యాన నిరసనలు

విజయనగరంలోని బాలాజీ కూడలిలో మానవహారం చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

హత్యాచారానికి గురైన డాక్టర్ మౌమితకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. మయూరి జంక్షన్ నుంచి బాలాజీ కూడలి వరకు పెద్ద ఎత్తున విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు మానవహారంగా ఏర్పడి అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ పది రోజులుగా దేశవ్యాప్తంగా కోల్‌కత్తాలో జరిగిన అమానుష ఘటనపై తీవ్రమైన చర్చ సాగుతోందని తెలిపారు. సభ్య సమాజం తలదించుకునేలా ఈ సంఘటన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులే విచారణలో చేతులెత్తేసి నిందితులకు సహకరించే పరిస్థితి ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సాక్షాత్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రోడ్లపై నిరసనలు చేస్తూ దొంగ ప్రేమ కురిపించడం చూస్తుంటే ఈ కేసు విచారణపై ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థం అవుతుందని విమర్శించారు. ఒకవైపు ఇది గ్యాంగ్ రేప్ అని పోస్టుమార్టం రిపోర్ట్ చెప్తుంటే ఒక వ్యక్తిని మాత్రమే అరెస్టు చేసి అతడిని బలిపశువును చేయడం ప్రభుత్వ చేతగానితనమని విమర్శించారు. ఈ సంఘటనని మామూలు అత్యాచార సంఘటనగా కాకుండా, దీని వెనక ఉన్న అన్ని కోణాలపైనా సిబిఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రచారంలో ఉన్న డ్రగ్స్ రాకెట్ అంశం ఈ హత్యాచారానికి ఏ విధంగా ముడిపడి ఉందో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

దేశంలో ప్రతిరోజూ మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయని, వీటిని ఖండించడానికి నిత్యం వేల మంది రోడ్లపైకి వస్తున్నా వారికి న్యాయం మాత్రం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనలు జరిగినప్పుడు దిశ, నిర్భయ, పోక్సో లాంటి వివిధ చట్టాలు చేస్తున్న ప్రభుత్వాలు వాటిని అమలు చేయడంలో మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నాయని విమర్శించారు. తక్షణమే కోల్‌కత్తాలో ట్రైనీ డాక్టర్ ఉదంతంపై న్యాయమైన విచారణ చేసి ఆమెకు, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నిరసనకు డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ మద్దతు పలుకుతూ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, నాయకులు రాజు, సుస్మిత, ఆద్య, శివ, రాజేష్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం : కోలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ఉమెన్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యాన రామభద్రపురంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అక్కడి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. మహిళా రక్షణకు ఉన్న చట్టాలు సక్రమంగా అమలుచేయాలని ఫోరం ప్రతినిధులు డిమాండ్ చేశారు. జూనియర్ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు విజయగౌరి, బి.శ్రీదేవి, జ్యోతి, సూర్యకుమారి, హైమావతి, సుబ్బలక్ష్మి, రమాదేవి, సుధారాణి, అల్లు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యాన ర్యాలీ

బొబ్బిలి : జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన కామాంధులను ఉరి తీయాలని టిడిపి సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, పట్టణ అధ్యక్షులు ఆర్.శరత్, ఎఎంసి మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, మహిళా కౌన్సిలర్లు బి.శ్రీదేవి, కె.లక్ష్మి, వి.హైమావతి డిమాండ్ చేశారు. హత్యాచారానికి వ్యతిరేకంగా మంగళవారం పట్టణంలో ర్యాలీ చేశారు. కోట నుంచి సిహెచ్‌సికి వరకు ర్యాలీ చేసి, వైద్యులకు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు మహిళలకు భద్రత కరువవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు, అత్యాచారాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామభద్రపురంలో నిరసన తెలుపుతున్న ఉమెన్స్ టీచర్స్ ఫోరం ప్రతినిధులు, ఉపాధ్యాయులు ; బొబ్బిలిలో ర్యాలీ చేపడుతున్న టిడిపి నాయకులు, మహిళా కౌన్సిలర్లు, కార్యకర్తలు

అక్టోబర్ 15న పైడితల్లమ్మ సిరిమాను సంబరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ ఉత్సవాల తేదీలు ఖరారయ్యాయి. ఈ ఏడాది అక్టోబర్ 15న పైడితల్లమ్మ సిరిమాను సంబరం జరగనుంది. పైడితల్లమ్మ ఉత్సవాల తేదీలను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డివివి ప్రసాదరావు వెల్లడించారు. మంగళవారం అమ్మవారి అన్నప్రసాద భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఉత్సవాల తేదీలను ప్రకటించారు. రాష్ట్ర పండుగగా అమ్మవారి జాతర ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 20న మండల దీక్షలు, పందిరిరాటతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. అక్టోబర్ 10న అర్ధ మండల దీక్షలు, 14న తొలేళ్ల ఉత్సవం, 15న ప్రధాన ఘట్టం సిరిమాను సంబరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 22న తెప్పోత్సవం, 27న కలశ జ్యోతి ఊరేగింపు, 29న ఉయ్యాల కంబాల, 30న చండీహోమంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. రాష్ట్ర పండగగా ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో అమ్మవారి జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. ఉత్సవాల నిర్వహణపై త్వరలోనే జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయనున్నామని తెలిపారు.



ఉత్సవాలు తేదీలను ప్రకటిస్తున్న సహాయ కమిషనర్, పూజారి

ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు మాట్లాడుతూ దసరా ముగిసిన వెంటనే వచ్చే మంగళవారం అమ్మవారి సిరిమాను జాతర నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందన్నారు. ఆ ప్రకారమే ఈ ఏడాది జాతర తేదీలను నిర్ణయించామని చెప్పారు. తాను వరుసగా ఎనిమిదో ఏడాది సిరిమాను అధిరోహిస్తున్నట్టు వివరించారు.

తాటిపూడి గురుకులంలో ఆకలికేకలు

- విద్యుత్ సరఫరా లేక నీటి కొరత
- మధ్యాహ్నం మూడు గంటల సమయంలో విద్యార్థినులకు భోజనాలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని తాటిపూడి గురుకుల పాఠశాలలో మంగళవారం వందలాది మంది విద్యార్థులు ఆకలితో అలమటించారు. ఉదయం నుంచి విద్యుత్తు సరఫరా లేకపోవడంతో నీటికొరత ఏర్పడి భోజనాలు వండలేదు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు మీడియాకు సమాచారం అందించారు. పాఠశాలను మీడియా ప్రతినిధులు పరిశీలించగా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో విద్యార్థులు భోజనాలు తినడం కనిపించింది. ఈ విషయంపై పాఠశాల ప్రిన్సిపల్ జామి సంధ్య మట్లాడుతూ కరెంటు సమస్య కొద్దిరోజులుగా ఉందని, దీనిని పరిష్కరించేందుకు మరమ్మతులు చేపట్టడంతో నీరు లేకపోవడం వల్ల వంట చేయడం ఆలస్యమైందని చెప్పారు. కరెంటు సరఫరా నిలిచినప్పుడు జనరేటర్ వినియోగించాలని ప్రశ్నించినప్పుడు, గడిచిన రెండేళ్లుగా జనరేటర్ పనిచేయడం లేదని సమాధానమిచ్చారు. జనరేటర్ బాగు చేయాలని సంబందిత కంపెనీ ఇంజినీర్లను కోరామని తెలిపారు. భోజనాలు ఆలస్యంగా పెట్టడం వల్ల కొంతమేర విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ఇటువంటివి పునరావృతం కాకుండా సంబంధిత అదికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

మధ్యాహ్నం మూడు గంటలకు భోజనాలు చేస్తున్న విద్యార్థులు

మరణంలోనూ వీడని స్నేహం

బావిలోకి దూకి అక్కాచెల్లెల్లు ఆత్మహత్య

ప్రజాశక్తి - పాచిపెంట

వారిద్దరు వరుసకు అక్కాచెల్లెల్లు. అంతకు మించి మంచి స్నేహితులు. వారి స్నేహబంధాన్ని చూసి, ఎవరికి కన్ను కుట్టిందో గానీ విధి వారిని దూరం చేయాలని చూసింది. అందులో ఒకరికి అనుకోని కష్టమొచ్చింది. దీంతో తనకు జీవితంపై ఆశ లేదని, చనిపోతానని తోటి స్నేహితురాలికి చెప్పింది. నీతోపాటు నేనూ వస్తానంటూ స్నేహితురాలి మరణంలోనూ మరో యువతి తోడెళ్లింది. మృత్యువు కూడా వారి స్నేహబంధాన్ని విడదీయలేకపోయింది. ఈ విషాదకర సంఘటన పాచిపెంట మండలం బొర్రమామిడి పంచాయతీ బొడ్డపాడు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం..

ఆటోలో తీసుకొస్తున్న సోంబారమ్మ, లక్ష్మి మృతదేహాలు

మండలంలోని బొర్రమామిడి పంచాయతీ బొడ్డపాడుకు చెందిన సేబి సోంబారమ్మ (24), పోయి లక్ష్మి (18) వరుసకు అక్కా చెల్లెల్లు. వీరు మంచి స్నేహితులు. సోంబారమ్మకు అదే గ్రామానికి చెందిన యువకుడితో పెద్దల సమక్షంలో వివాహం కుదిరింది. అయితే గత వారం రోజులుగా ఆ జంట మధ్య మనస్పర్థలు రావడంతో వివాహం రద్దయింది. దీంతో సోంబారమ్మ తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ విషయమై తన స్నేహితురాలైన లక్ష్మి వద్ద తాను బతకనని, చనిపోతానంటూ వాపోయింది. నీవు లేకపోతే నేను కూడా బతకనని, చావైనా, బతుకైనా ఇద్దరం కలిసే చనిపోదామంటూ నిశ్చయించుకున్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి గ్రామ సమీపాన ఉన్న నేల బావి వద్దకు చేరుకున్నారు. చున్నీతో ఇద్దరూ చేతులకు కట్టుకుని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. రాత్రంతా వీరు ఇంటికి రాకపోవడంతో బంధువులు చుట్టుపక్కలా వెతికారు. మంగళవారం ఉదయం నేలబావిలో వీరి మృతదేహాలు తేలియాడడాన్ని స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు కుటుంబీకులు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ పి.నారాయణరావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సిహెచ్‌సి తరలించారు. పాచిపెంట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనుల ఆమోదానికి గ్రామసభలు

కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉపాధి హామీ పనుల ఆమోదం కోసం ప్రతి గ్రామంలో ఈ నెల 23న గ్రామసభలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈ గ్రామసభల్లో సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయం చేసుకొని ప్రణాళికా బద్ధంగా గ్రామసభలను విజయవంతం చేయాలన్నారు. మంగళవారం ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామసభలపై పలు సూచనలు చేశారు. గ్రామ సభల్లో గ్రామపెద్దలు, ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొనేలా ఎంపిడిఒ బాధ్యత తీసుకోవాలన్నారు. రెండు రోజుల ముందే గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయించాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు వీలున్నంత ఎక్కువ గ్రామాల్లో గ్రామ సభలకు హాజరు కావాలని సూచించారు. డ్వాక్రా మహిళల ద్వారా ఎక్కువ ప్రచారం చేసి, గ్రామసభలకు మహిళలు ఎక్కువగా హాజరయ్యేలా చూడాలని డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తికి తెలిపారు. గ్రామసభల కార్యక్రమాలన్నీ వీడియోగ్రఫీ చేయాలని, ఎక్కడ ఎలాంటి పొరపాటు జరగకుండా, సభలు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం డ్వామా పీడీ అరుణశ్రీ, డిపిఒ శ్రీధర్ రాజా, గ్రామ వార్డ్ సచివాలయ నోడల్ అధికారి నిర్మలా దేవి, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి రామారావు మాట్లాడారు.

ఇసుక కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

సువర్ణముఖి నదిలో పూడిక తొలగించాలి

వంగర మండలం కొండచాకరాపల్లి వద్ద సువర్ణముఖి నదిలో పూడిక తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. ఇక్కడ పనులు వారం రోజుల్లో ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగింది. వరద నివారణకు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు, భూగర్భ జలాలను వృద్ధి చేసేందుకు, సువర్ణముఖి నదిలో కొండచాకరాపల్లి వద్ద పేరుకుపోయిన ఇసుకను తొలగించాలని నీటిపారుదల శాఖ అధికారులు ఇచ్చిన నివేదికపై చర్చించారు. దీనికి సంబంధించిన అన్ని అనుమతులు తీసుకొని, వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. తొలగించిన ఇసుకను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, భూగర్భ గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ సూర్యచంద్రరావు, ఆర్‌డిఒలు బి.శాంతి, ఎంవి సూర్యకళ, పొల్యూషన్ కంట్రోల్ ఇఇ సరిత, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాదరావు, మైన్స్ ఎడి విజయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్: జిల్లాలో వివిధ ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల సంరక్షణ గృహాలు, వసతిగృహాలు, ఆశ్రమాల్లో పరిస్థితులపై తనిఖీ చేసి రెండు రోజుల్లోగా నివేదికలు అందజేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జిల్లాలోని సంక్షేమ అధికారులను ఆదేశించారు. అనకాపల్లి జిల్లా కోటవురట్లలో ఆశ్రమంలో ఫుడ్ పాయిజనింగ్‌తో ముగ్గురు చిన్నారులు మృతిచెందడంతో ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశారు. జిల్లాల్లో

వసతిగృహాలు, ఆశ్రమాల్లో తనిఖీలు చేపట్టాలి

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న పిల్లల హాస్టళ్లు, ఆశ్రమాలు, సంరక్షణ కేంద్రాల్లో తక్షణమే తనిఖీలు చేపట్టి అక్కడ పరిస్థితులపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మహిళా శిశు సంక్షేమాధికారులు, వికలాంగుల సంక్షేమశాఖ అధికారికి ఆయా వసతిగృహాలు, సంరక్షణ కేంద్రాల తనిఖీపై కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

సిటియులో ఫొటోగ్రఫీపై వర్క్‌షాప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలోని జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ అంతర్జాతీయ యాత్రికుడు, ఫొటోగ్రాఫర్ బీరా అశోక్ మాట్లాడుతూ ఫొటోగ్రఫీ మాధ్యమం సాంకేతికతకు మించి ఒక కథను చెప్పే శక్తిగా ఎలా రూపుదిద్దుకుంటుందో వివరించారు. ప్రతి ఫొటో ఒక కథ, ఒక సందర్భం, ఒక సంస్కృతిని పట్టుకోవడానికి కళ్ల ద్వారా ప్రపంచాన్ని చూసే అద్భుత సాధనమన్నారు. అనంతరం విద్యార్థులకు ఫొటోగ్రఫీ పై శిక్షణ ఇచ్చారు. స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్, జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ శరత్చంద్ర బాబు మాట్లాడుతూ ఫొటోగ్రఫీని కేవలం సాంకేతిక పరిజ్ఞానంగా కాకుండా ఒక కళాత్మక ప్రక్రియగా చూడాలన్నారు. ఫొటోల్లో యథార్థాన్ని ప్రతిబింబించే ప్రయత్నం చేయాలని, ప్రేక్షకుల మనసుకు హత్తుకునే ఫొటోలు తీయాలని సూచించారు. ఫొటోగ్రఫీ విద్యలో ఉన్న ప్రాధాన్యతను వివరించారు.

ఇన్‌స్పైర్ మానక్‌కు ప్రాజెక్టుల నమోదు

విజయనగరం టౌన్ : ఇన్‌స్పైర్ మానక్ కోసం ప్రాజెక్టులు నమోదు చేయాలని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పిఎస్ఆర్ స్కూల్లో నిర్వహించిన సైన్స్ టీచర్ల ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులను ఈనెల చివరిలోగా నమోదు చేయాలన్నారు. ఉన్నత పాఠశాల నుంచి ఐదు, ప్రాథమికోన్నత పాఠశాలలో నుంచి మూడు ప్రాజెక్టులు చొప్పున ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి మిరియాల కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించిన శిక్షణలో రిసోర్స్ పర్సన్లుగా ఎస్.ఉమామహేశ్వరరావు, టి.రాజేష్ వ్యవహరించారు.

వాస్తవ ప్రణాళికలను రూపొందించాలి

విజయనగరం : వ్యవసాయ శాఖ ఐదేళ్ల ప్రణాళికను వాస్తవంగా చేయగలిగే లక్ష్యాలతో రూపొందించాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించేటప్పుడు సాధ్యాసాధ్యాలను దృష్టిలో పెట్టుకోవాలన్నారు. రైతులకు ఉపయోగపడేలా ఉంటూ, జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. సాగు భూమి విస్తీర్ణం, పంటల దిగుబడిని పెంచాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, సిపిఒ బాలాజీ, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, ఎపిఎంఐపి పీడీ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లకు విరాళాలు ఇవ్వొచ్చు

విజయనగరం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ల నిర్వహణకు దాతలు విరాళాలు ఇవ్వవచ్చని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్ పరిసరాలను ఆయన పరిశీలించారు. పేదలకు అందుతున్న అల్పాహారం ఏ విధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. అల్పాహారాన్ని తీసుకుంటున్న పేదలు ఎంతో రుచికరంగా ఉందని తెలియజేయడంతో ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు.

పర్యావరణ సమతుల్యానికి మొక్కలు దోహదం

పర్యావరణ సమతుల్యానికి మొక్కలు దోహదపడతాయని కమిషనర్ ఎంఎం నాయుడు తెలిపారు. మేరే లైఫ్ ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మే కే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఉద్యాన శాఖ అధికారి ఉమా భరణి తదితరులు పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా

ప్యాకింగ్ చేసి ఢిల్లీ తరలింపు ● ముగ్గురు వ్యక్తులు అరెస్టు.. 22.7 కిలోల గంజాయి సీజ్

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగర శివార్లలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి ప్యాకింగ్ చేసి, ఢిల్లీ తరలిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ధర్మపురి పంచాయతీ పరిధిలోని వసంత విహార్ లే అవుట్‌లో ఒక విల్లాను అద్దెకు తీసుకొని, గంజాయిని వేర్వేరు ప్రాంతాలకు రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు...

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్ జిల్లాకు చెందిన మహ్మద్ వసీమ్ ఏడాదిన్నర క్రితం విజయనగరం వలస వచ్చి, శివారు ప్రాంతాల్లో ఇల్లు అద్దెకు తీసుకొన్నాడు. ఒడిశా, ఇతర ప్రాంతాల నుండి గంజాయి తీసుకొని వచ్చి, అద్దెకు తీసుకున్న ఇంటిలో చిన్న ప్యాకెట్లు చేసి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లుగా రూరల్ పోలీసులకు సమాచారం వచ్చింది. ఈ సమాచారం మేరకు రూరల్ ఇన్‌ఛార్జి సిఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి, ఆ ఇంటిలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 22.7 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అందులో బీహార్ రాష్ట్రం కిషన్‌గంజ్ జిల్లా అల్తవాడ గ్రామానికి చెందిన ఇన్ఫోజ్ ఆలం, ఢిల్లీలోని జామీయానగర్‌కు చెందిన రుక్స్యాయి కుర్షీద్ అనే మహిళ ఉన్నారు. ఇన్ఫోజ్ ఆలం, రుక్స్యాయి కుర్షీద్ గంజాయిని ఢిల్లీ తీసుకొని వెళ్లేందుకు గాను విజయనగరం వచ్చారు. గంజాయి వాసన రాకుండా వినియోగించే కంఫర్ట్ లిక్విడ్, అగరబత్తులను వినియోగించడం గమనార్హం.

ఒడిశా టు ఢిల్లీ.. వయా విజయనగరం

మహ్మద్ వసీం ఢిల్లీకి చెందిన మహ్మద్ కబీర్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి, డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో గంజాయి వ్యాపారం చేసేందుకు నిర్ణయించుకొన్నాడు. గంజాయిని ఒడిశా నుండి ఆంధ్రాకు, అక్కడ నుండి ఢిల్లీకి పథకం ప్రకారం తరలిస్తున్నారు. ఇందుకుగాను గంజాయిని అరకు ప్రాంతానికి చెందిన మజ్జి విశ్వనాథం, ఆయన భార్య మజ్జి గంగమ్మ ఒడిశా నుండి గంజాయిని కొనుగోలు చేసి, మహ్మద్ వసీమ్‌కు విక్రయించేలా ఒప్పందం కుదుర్చుకొన్నారు. గంజాయిని అరకు నుంచి విజయనగరం రవాణా చేసేందుకు గొర్లి అనిల్, గోవింద, గోపి, అర్జున్ సహకరించేవారు. వీరిని త్వరలో అరెస్టు చేస్తామని ఎస్‌పి తెలిపారు. సమావేశంలో డిఎస్‌పి ఆర్.గోవిందరావు, భోగాపురం సిఐ జి.రామకృష్ణ, ఎస్‌బి సిఐ కె.కె.వి.విజయనాథ్, రూరల్ ఎస్ఐలు ఆర్.వాసుదేవ్, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

ఇటీవల మరణించిన హోంగార్డుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి వకుల్ జిందాల్ అందజేశారు. విధి నిర్వహణలో మరణించిన హోంగార్డు కుటుంబాలను ఆదుకునేందుకు వారి కుటుంబంలో ఇద్దరు మహిళలను హోంగార్డులుగా నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. కరెంటు షాక్‌కు గురై మరణించిన హోంగార్డు జి.వెంకట సత్యం కుటుంబానికి హోంగార్డులు సమకూర్చిన రూ.23,430ను అందజేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, ప్రభుత్వం నుండి రావాల్సిన రాయితీలను సకాలంలో అందే విధంగా చర్యలు చేపడతామని ఎస్‌పి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్ పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిరోధక చట్టం చేయాలి

జనవిజ్ఞాన వేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మూఢనమ్మకాల నిరోధక చట్టం చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు అధ్యక్షతన పిఆర్ మినిస్టీరియల్ హాల్లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ మహారాష్ట్రలో మూఢనమ్మకాల వ్యతిరేక పోరాటం చేసి మతోన్మాదుల చేతిలో హత్యకు గురైన నరేంద్ర దాబోల్కర్ వర్ధంతిని దేశ వ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథం దినంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో జెవివి, ప్రగతి శీల, అభ్యుదయ సంఘాలు కలిసి మూఢ నమ్మకాల నిరోధక చట్టం చేయాలనే డిమాండ్‌ని ప్రభుత్వం ముందు పెడుతున్నాయని తెలిపారు. మూఢ నమ్మకాల వల్ల ప్రతిరోజూ అనేక మంది అమాయకులు, మహిళలు ప్రాణాలు కోల్పోవడం, ఆస్తి నష్టపోవడం, మోసపోవడం లాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వీటితోపాటు సమాజంలో శాంతి భద్రతలకి విఘాతం కలుగుతోందన్నారు. సమాజంలో మూఢవిశ్వాసాలు, అశాస్త్రీయ భావనలు పెరుగుతున్నాయని చెప్పారు. ప్రజాస్వామ్యం, లౌకికతత్వం దాడికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో సమాజం నుంచి మూఢనమ్మకాలను దూరం చేసి, శాస్త్రీయ సమాజ నిర్మాణం చేయాలని ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. శాస్త్రీయ దృక్పథం పెంచే విధంగా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఒక పటిష్టమైన చట్టాన్ని రూపొందించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వాల తక్షణ కర్తవ్యమని అభిప్రాయ పడింది. సమావేశంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ చీకటి దివాకర్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్ పట్నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాము, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బి.సుధారాణి, సమతా కన్వీనర్ జి.నిర్మల, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీష్, పట్టణ పౌర సంక్షేమం సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, మెడికల్ రిప్స్ సంఘం నాయకులు కె.శశిధర్, సాహితీ వేత్త, ఆర్ చౌదరి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్ ఆనంద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిన్నారి, జెవివి రాష్ట్ర నాయకులు వి.రాజగోపాల్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్స్ సంఘం నాయకులు సిహెచ్ సింహాచలం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాసా తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

సిబిఎం పాఠశాలను మూసివేస్తే పోరాటం

ప్రజాశక్తి - బొబ్బిలి

సిబిఎం పాఠశాలను మూసివేస్తే పోరాటం చేస్తామని ఎస్.ఎఫ్.ఐ డివిజన్ కార్యదర్శి మణికుమార్ అన్నారు. పట్టణంలో ఉన్న సిబిఎం బాలికోన్నత పాఠశాల రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయకపోవడంతో విద్యార్థులు తల్లిదండ్రులతో డిప్యూటీ డిఇఒ మోహనరావు సమావేశం నిర్వహించారు. పాఠశాల రెన్యూవల్ అవ్వలేదని, పాఠశాలను మూసివేసే ఇక్కడ చదువుతున్న విద్యార్థులను వేరే పాఠశాలకు తరలిస్తామని డిప్యూటీ డిఇఒ మోహనరావు అనడంతో ఎస్.ఎఫ్ఐ నాయకులు, సిబిఎం చర్చి ప్రతినిధులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించే పాఠశాలను మూసి వేస్తే ఆందోళన చేస్తామని, ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేసి పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేయని కరస్పాండెంట్ను తొలగించి నూతన కరస్పాండెంట్ను నియమించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సమస్యను వివరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు : ఆర్డీ

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ ఆర్డీ జి.నాగరాజు కోరారు. మున్సిపాలిటీలో మంగళవారం పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలువలను శుభ్రం చేసి ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కోరారు. ఇందిరమ్మ కాలనీలో కాలువల్లో పూడికలు తీతను పరిశీలించారు. అపార్ట్మెంట్లో ఆన్సైట్ కంపోస్టును పరిశీలించి పలు సూచనలు చేశారు. చిక్కటి పార్కును పరిశీలించి సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. పట్టణంలో సేకరిస్తున్న చెత్త నుంచి తయారు చేస్తున్న ఎరువును హ్యూజ్ బయో ఎనర్జీ ఏజెన్సీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, శానిటరీ ఇన్స్పెక్టర్ శివ, ఆర్ఒ ప్రసాద్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని పలుచోట్ల ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని సబ్బవరపు కల్యాణ మండపంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మణిబాబు, నానాజీ యువ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతీయ సద్భావన దినోత్సవం నిర్వహించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవ తెలిపారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ ప్రజలకు, దేశానికి చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎ.పావనీదేవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ వి సుధీర్, అధ్యాపకులు ఎస్ పలివేణి, కే అప్పలరాజు, డి హైమావతి, డి రామకృష్ణ, డి లక్ష్మణ్, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యా సామర్థ్యంపై ఎంఇఒ ఆరా

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని ఆర్ ఆముదాలవలస కాలనీ పాఠశాలను ఎంఇఒ ఎం. వరప్రసాదరావు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసనపై ఆరా తీశారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు అభ్యాసనపై దృష్టి సారించాలన్నారు. విద్య సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఎంఇఒతో పాటు పాఠశాల హెచ్ఎం వరుణ్ కుమారి, భవిత కేంద్ర ఐఆర్ మహేశ్వరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

గాలి కుంటు వ్యాధి నివారణకు చర్యలు

ప్రజాశక్తి - మెరకముడిదాం

మండలంలోని 29 పంచాయతీలలో పశువులకు సంభవించే గాలి కుంటు వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు మెరక ముడిదాం పశు వైద్యాధికారి సిహెచ్ హైమావతి అన్నారు. మండలంలో ఆగస్టు 20వ తేదీ నుంచి వచ్చే నెల వరకు గాలి కుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు ఆమె తెలిపారు. మంగళవారం ఒక్క రోజే సుమారు 70 పశువులకు టీకాలు వేసినట్లు చెప్పారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గరివిడి

మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో మంగళవారం 20 మంది నిరుపేదలకు, వృద్ధులకు ఆ గ్రామానికి చెందిన మన్నెపురి ఉమామహేశ్వరరావు (బిట్టి) దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలను, వృద్ధులను, వికలాంగులను ఆదుకోవాలని జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్పీ బెల్లాన చంద్రశేఖర్ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన సీనియర్ రిటైర్డ్ టీచర్ పెనుమత్స సాంబమూర్తి మాస్టర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984, 85 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం ఒకచోట కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుని పూర్వ జ్ఞాపకాలను నెమరు వేసుకుని సందడి చేశారు.

పోలిపల్లిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లి గ్రామంలో విజయనగరానికి చెందిన క్వాక్సో ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పోలిపల్లి గ్రామానికి చెందిన స్టార్ బాయ్స్ డాన్స్ స్కూల్ వార్షికోత్సవ సందర్భంగా ఎన్విఎన్ బ్లడ్ బ్యాంక్ రక్తసేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో క్వాక్సో హాస్పిటల్ అధినేత మోపాడ ప్రవీణ్ కుమార్, బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు సుధాకర్, డాన్స్ స్కూల్ నిర్వాహకులు ఆది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆతవ ఎంపిపి పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవ పాఠశాలను ఎంఇఒ పి. బాలభాస్కరరావు మంగళవారం పరిశీలించారు. తరగతి గదులు, టాయిలెట్స్ను పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్ చదివించడం, రాయించడం, చతుర్విధ ప్రక్రియలు చేయించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని పరిశీలించారు.

పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఇఒ

నేరాలు ఘోరాలు

తోటపల్లి కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బొబ్బిలి: మండలంలోని అలజంగి-పారాది మధ్యలో తోటపల్లి కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని రైతులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు తోటపల్లి కాలువ వద్దకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం గదిలో భద్ర పరిచారు. మృతుని వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు కోరారు.

అట్రాసిటీ కేసు నమోదు

రేగిడి: మండలంలోని దేవుదల గ్రామానికి చెందిన కుప్పిలి దుర్గమ్మ పాలకొండకు చెందిన పొట్నూరు దుర్గారావు, జయశ్రీ, మనోజ్, మంజులపై కులం పేరుతో దూషించారని మంగళవారం అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్ఐ రాజారావు తెలిపారు. కులం పేరుతో దూషించడమే కాకుండా దాడికి గురైన దుర్గమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొన్నేళ్ల క్రితం దుర్గమ్మ పెద్ద కుమారుడు గణపతిని మంజుల ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ చేసుకుంది. ఇద్దరు పిల్లలు కూడా జన్మించారు. అయితే గణపతి తో పాటు అత్తమామలను గుర్తించక దుర్గమ్మను మంజు కుటుంబ సభ్యులు అంటరానితనంగా చూపి వేరే పెడుతున్నారు. ఫిర్యాదులు పేర్కొన్నారు. దీంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దొంగ అరెస్టు

గరివిడి: మండలంలోని దేవాడ గ్రామంలో ఆగస్టు 15న ఏనేటం అనాప ఇంట్లో 9 తులాల బంగారం పోయిన విషయం తెలిసిందే. ఆ కేసును పోలీసులు ఛేదించారు. అదే గ్రామానికి చెందిన తాళ్ళపూడి దుర్గాప్రసాద్ ఈ దొంగతనానికి పాల్పడ్డాడని గుర్తించి అతన్ని మంగళవారం అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచామని ఎస్ఐ ఆయన వద్ద నుంచి 9 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

అధికార పార్టీలో ఆధిపత్య పోరు

- గొంప, కోళ్ల గ్రూపుల మధ్య కుమ్ములాట
- రోజురోజుకూ పెరుగుతున్న అసమ్మతి

ప్రజాశక్తి - జామి

అధికార తెలుగుదేశం పార్టీలో ఆధిపత్య పోరు పురుడు పోసుకుంటోంది. దీంతో అధికారం మాది అంటే. మాది అంటూ కుమ్ములాడుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా నియోజకవర్గంలోని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ గ్రూపుల మధ్య ఈ కుమ్ములాటలు రోజు రోజుకి తారా స్థాయికి చేరుతున్నాయి. మండల పార్టీ అధ్యక్షుడు లగుడు రవికుమార్ తొలి నుంచి గొంప సారథ్యంలోనే పని చేస్తున్నారు. గొంపకు పార్టీ టిక్కెట్ దక్కనప్పటికీ ఎంపి భరత్ ఆదేశాల మేరకు కోళ్లని గెలిపించుకునే బాధ్యత గొంప గ్రూపు తీసుకున్న విషయం తెలిసిందే. చివరికి అనుకున్నట్లే కోళ్ల ఎమ్మెల్యే అయ్యారు. కానీ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రతిపక్ష పార్టీ కన్నా.. గొంప కృష్ణ గ్రూపుతోనే ఎక్కువ పోట్లాడుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా టిడిపి మండల పార్టీ కమిటీల ఏర్పాటులో లగుడు రవికుమార్ను పక్కని పెట్టి కోళ్ల అనుచరులుగా ఉన్న వర్రి రమణకు పార్టీ పగ్గాలు దక్కించుకోవాలని బావిస్తున్నారు. అయితే ఆ గ్రూపులోని కొంత మంది సీనియర్ నాయకులు వర్రి రమణను వ్యతిరేకిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు కోళ్ల వర్గంలోనే రెడ్డి పైడిబాబు, రామయ్యపాలెం మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి పార్టీ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. కోళ్ల వర్గం ఎన్ని ప్రయత్నలు చేసినా, ఎమ్పి భరత్ కనుసన్నల్లోనే కమిటీ ఏర్పాటు జరిగుతోందని, గొంప గ్రూపు చెప్పుకొస్తుంది. కోపరేటివ్ సొసైటీ అధ్యక్ష పదవికి కూడా కుమ్ములాడుకుంటున్నట్లు ప్రచారం ఉంది.

కోళ్ల లలితకుమారి

తొలగింపులు, చేర్పుల్లోనూ విభేదాలు

గ్రామాల్లో పీల్డ్ అసిస్టెంట్లు, బుక్ కీపర్లు వంటి వారిని తొలగింపు చర్యల్లోనే సొంత పార్టీలో విభేదాలు ఉన్నాయి. తొలగించాలని ఒకరు, వద్దని ఇంకొకరు పోటీ సిఫార్సులు చేసుకుంటున్నారు. జామి మేజరు పంచాయతీ విషయానికొస్తే, వైసిపి నాయకుల్లో ఒక గ్రూపు పూర్తిగా టిడిపితో మిలాకాతు కాగా, గొంప గ్రూపునకు గ్రామంలో నాయకత్వం వహిస్తున్న మాజీ సర్పంచ్ ఇప్పాక వెంకట త్రివేణి ప్రతిపక్ష పాత్ర పోసిస్తున్నట్లు ప్రచారం జరిగితోంది.

గొంప కృష్ణ

ఎన్నికల్లో ఓట్లేసి.. నేడు పార్టీలో చేరిక

గత ఎన్నికల్లో టిడిపి నాయకత్వంతో పూర్తిగా అవగాహన ఏర్పాటు చేసుకున్న వైసిపి నాయకులు ఇప్పుడిప్పుడే టిడిపి కండువాలు వేసుకుంటున్నారు. ఇటీవల చింతాడ మాజీ సర్పంచ్ కెంగుం పద్మ అదే కోవలో టిడిపిలో చేరారు. ఇలాంటి మరికొంత మంది త్వరలో పార్టీ మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే పార్టీ చేరికల్లోనూ వర్గ విబేధాలు బయటపడుతున్నాయి. చింతాడ మాజీ సర్పంచ్ చేరికను గొంప గ్రూపు వ్యతిరేకిస్తున్నా కోళ్ల అనుచరులుగా ఉన్నవారు అతి ఉత్సాహంతో చేర్చుకున్నట్లు ఆరోపనులు ఉన్నాయి. గతం నుంచి పార్టీని నమ్ముకుని ఉన్నవారిని పక్కన పెట్టి, వైసిపి నుంచి వచ్చిన వారిని అందలెక్కించడం ఏంటని గొంప గ్రూపు ప్రశ్నిస్తోంది. స్థానిక నాయకత్వానికి ఎటువంటి సమాచారం లేకుండా కోళ్ల గ్రూపునకు చెందిన నాయకులు హడావుడిగా పార్టీలో చేర్చుకోవడం పట్ల సొంత పార్టీలోనే కొంత మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఇలా ప్రజా సమస్యల విషయంలోనూ ప్రతిపక్ష పార్టీ నాయకుల కన్నా, సొంత పార్టీ నాయకుల మద్యే కుమ్ములాటలు కనిపిస్తున్నాయి. జామి గ్రామంలో వైసిపి నాయకులతో కలిసిపోయి, సొంత పార్టీ వ్యక్తుల పనులకె అడ్డు పడుతున్నారని గొంప గ్రూపు సభ్యులు ఆరోపిస్తున్నారు. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కూడా గ్రామాభివృద్ధికి ఇలాగే అడ్డుపడ్డారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా టిడిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టిడిపిలో గ్రూపు తగాదాలతో మునిగి తెలుతోంది. ఇప్పటికైనా అధిష్టానం దృష్టి సారించి గ్రూపులకు చెక్ పెడుతుందా.? ఇదే పంథాలో పాలన కొనసాగిస్తుందా వేచి చూడాల్సిందే..

రోడ్డు బాగు చేయాలని వినూత్న నిరసన

ప్రజాశక్తి - బొబ్బిలి

పూల్బాగ్ రోడ్డును బాగు చేయాలని కోరుతూ మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు వినూత్న నిరసన తెలిపారు. పూల్బాగ్ రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడి వర్షం కురిస్తే చెరువులను తలిపించడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు గోతులలో ఉన్న మురుగు నీటిలో కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి మణికుమార్ మాట్లాడుతూ పూల్ బాగ్ రోడ్డు చెరువును తలపిస్తున్నా బాగు చేసేందుకు అధికార యంత్రాంగం పని చేయకపోవడం దుర్మార్గమన్నారు. గోతులలో వాహనాలు పడిపోయి ప్రమాదాలు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇదే రోడ్డులో కళాశాలలు ఉండడంతో రాకపోకలకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు బాగు చేసి ప్రమాదాలను నివారించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో రోడ్లు అద్వాన్నంగా మారాయని, తక్షణమే బాగు చేయాలని డిమాండ్ చేశారు. రెండు వారాలలో పూల్ బాగ్ రోడ్డు బాగు చేస్తామని మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఇంజినీరింగ్ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, చరణ్, సిఐటియు నాయకులు సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

గోతుల్లో కూర్చుని నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రోడ్డు బాగు చేసేందుకు ప్రతిపాదనలు

పూల్ బాగ్ రోడ్డును బాగు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. పూల్ బాగ్ రోడ్డును మున్సిపల్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూల్ బాగ్ రోడ్డును తాత్కాలికంగా బాగు చేసేందుకు ప్రతిపాదనలు చేయాలన్నారు. మున్సిపల్ నిధులతో రోడ్డు బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయనతో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులు ఉన్నారు.

గోతులు పూడ్చివేత

పూల్ బాగ్ రోడ్డుపై ఉన్న గోతులను ఎమ్మెల్యే బేబినాయన సొంత నిధులతో పూడ్చుతున్నారు. రోడ్డు బాగు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలపడంతో బేబినాయన స్పందించి సొంత నిధులతో గోతులలో నిర్మాణ సామగ్రి వ్యర్థాలను వేస్తున్నారు. గోతులను పూడ్చడంతో వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు

పాత మహిళా పోలీసు స్టేషన్ పరిశీలన

విజయనగరం కోట : నగరంలోని పద్మావతినగర్లో ఉన్న పాత మహిళా పోలీసు స్టేషన్ భవనాన్ని ఎస్పి వకుల్ జిందాల్ మంగళవారం పరిశీలించారు. మహిళా పోలీసు స్టేషన్లను దిశ మహిళా పోలీసు స్టేషన్లుగా గత ప్రభుత్వం మార్పు చేసిన విషయం తెలిసిందే. ప్రజలకు అందుబాటులో మహిళా పోలీసు స్టేషను ఉండాలని భావించిన అప్పటి పోలీసు అధికారులు పోలీసు బ్యారెక్స్కు ఆనుకొని దిశ మహిళా పోలీసు స్టేషను భవన నిర్మాణం చేపట్టారు. అప్పటి నుండి పద్మావతినగర్లోని మహిళా పోలీసు స్టేషను భవనం వినియోగంలో లేదు. ఆ భవనాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ఎస్పి వకుల్ జిందాల్ చర్యలు చేపట్టారు. ఆ భవనాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. చేపట్టాల్సిన మార్పులను అధికారులకు సూచించారు. పోలీసుశాఖ అవసరాలకు భవనాన్ని తిరిగి వినియోగంలోకి తీసుకు రావాలని భావిస్తున్నట్లుగా ఎస్పి వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్బి సిఐ కె.కె.వి.విజయనాథ్, ఎపి పోలీసు హౌసింగు ఎఇ ఆర్.రాజబాబు, కాంట్రాక్టరు ఎస్.రమణ ఉన్నారు.

రైతులకు ఎరువులెందుకు అందడం లేదు?

ప్రజాశక్తి - వంగర

రైతులకు ఖరీఫ్లో ఎరువులు ఎందుకు సక్రమంగా అందటం లేదని సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావుతో పాటు మరికొందరు సభ్యులు ఎఒను నిలదీశారు. ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన వ్యవసాయ చర్చిలో పలువురు మాట్లాడుతూ ఏఏ సచివాలయాల్లో ఎంత మేరా ఎరువులు పంపిణీ చేశారు? ఇప్పటికైనా పూర్తిస్థాయిలో యూరియా పోటాస్ అందిస్తారా లేదా అని ప్రశ్నించారు. ఎఒ కన్నబాబు మాట్లాడుతూ ఎరువులు నిల్వ చేసేందుకు గుడాలు పూర్తిస్థాయిలో లేనందున ఎక్కువ మొత్తంలో ఒక్కసారి తేలేకపోతున్నామని, రైతులందరకీ ఎరువులు అందించేందుకు చర్యలు చేపడతామ న్నారు. ఎంఇఒ ప్రవీణ్ మాట్లాడుతూ వంగరలో ఓపెన్ స్కూల్ ప్రారంభమైందని దూరవిద్య ద్వారా 10వతరగతి ఇంటర్ చదవాలనుకున్నవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. మండలంలోని జరిగిన ఎస్ఎంసి ఎన్నికల్లో శివ్వాంలో కోరం లేక రెండుసార్లు వాయిదా పడిందన్నారు. మిగతా అన్ని పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికలు పూర్తయ్యాయని తెలిపారు. పుస్తకాలు పంపిణీలో సర్పంచ్, ఎంపిటిసిలకు ఎందుకు సమాచారం ఇవ్వటం లేదని ఎంఇఒను సభ్యులు ప్రశ్నించగా అందరికీ సమాచారం ఇవ్వాలని సిబ్బంది ముందుగానే చెప్పానని ఇక మీదట ఇటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని తెలిపారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు నెలకు 4వేల రూపాయలు చొప్పున ఇస్తున్నామని ఐసిడిఎస్ సూపర్వైజర్ రజనీ దుర్గ వెల్లడించారు. మండలంలో ఐదుగురిని గుర్తించామని తెలిపారు. ఇందులో ఇద్దరికీ డబ్బులు పడ్డాయని తెలిపారు. తమ గ్రామానికి తాగునీరు పూర్తిస్థాయిలో అందించాలని లక్ష్మీంపేట సర్పంచ్ కోరారు. అనంతరం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ వ్యవసాయానికి అనుసంధానం చేస్తూ ఉపాధి హామీ పనులు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో కరణం సుదర్శనరావు, ఎంపిడిఒ త్రినాథరావు, డిటి సుందరరావు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వ్యాధులపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - బొండపల్లి

స్థానిక పిహెచ్సి పరిధిలోని గొల్లలపేట, వేంద్రాం గ్రామాలలో మంగళ వారం ప్రపంచ దోమల దినోత్సవంలో భాగంగా వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి యల్. సత్యనారాయణ మాట్లాడుతూ 1897 ఆగస్టు 20వ తేదీన సర్ రోనాల్డ్ రాస్ అనే శాస్త్రవేత్త ఆడ అనాఫిలస్ దోమలే మలేరియా వ్యాధికి కారణమైన పరాన్నజీవని కనుగొన్నారని గుర్తు చేశారు. ఈ మేరకు ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రజలందరూ దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ గోవింద రాజులు, సూపర్వైజర్ ఎస్ఎ భాష, గోపి, ఎంఎల్ఎచ్పిలు లక్ష్మి, హారిక, ఎఎన్ఎం బీనా, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని తహశీల్దార్ అరుణ్ కుమార్ అన్నారు. ప్రపంచ దోమలు దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని దేవీ గుడి కూడలి వద్ద డాక్టర్ సర్ రోనాల్డ్ రాస్ని గుర్తు చేసుకుంటూ ర్యాలీ చేపట్టారు. అనంతరం దోమల నిర్మూలనకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కొట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు జె హారిక, శిరీష, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు రామ సత్యం, ఆరోగ్య కార్యకర్తలు శంకర్, ప్రభావతి, ఆశా కార్యకర్తలు, ఎంటిఎస్ రాజశేఖర్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

బొండపల్లి: ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి - బాడంగి

శ్రీకాకుళంలో ఈ నెల 16,17,18 తేదీలలో జరిగిన జూనియర్ రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలలో బాడంగి జెడ్పి పాఠశాలకు చెందిన మరడాన ప్రసన్న సత్తా చాటింది. మన జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహించి స్టేట్ ప్రథమ స్థానం పొందటంలో కీలక పాత్ర పోసించింది. వీరికి కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా ట్రోఫీ, గోల్డ్ మెడల్ అందించారు. ప్రసన్నను, ఆమెకు శిక్షణ ఇచ్చిన పాఠశాల పీడీ గొర్లె బంగారునాయుడును, హెచ్ఎం సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు, అధికారులు, నాయకులు అభినందించారు.

ప్రసన్న

రెండో విడత డిగ్రీ అడ్మిషన్స్ ప్రారంభం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ఈ నెల 22 నుంచి ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు మంగళవారం తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్తో కళాశాలకు హాజరైతే ఉచితంగానే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 24వ తేదీన ముగుస్తుందని, తమ కళాశాలలో బిఎ పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్, బిఎస్సి కెమిస్ట్రీ, బిఎస్సి మ్యాథమెటిక్స్ కోర్సులు అందిస్తున్నామన్నారు. తమ కళాశాలలో ఎన్సిసి, ఎన్ఎస్ఎస్, డిజిటల్ క్లాస్ రూమ్లు, కెమిస్ట్రీ, ఫిజిక్స్, కంప్యూటర్ ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీ ఉన్నాయని తెలిపారు. ఎస్సి, ఎస్టి, బిసి విద్యార్థులకు హాస్టల్ వసతి కూడా ఉందని విద్యార్థులు ఈ నెల 24వ తేదీ లోపల తమ రిజిస్ట్రేషన్ ఎమ్డిసి వెబ్సైట్లో చేసుకోవాలని తెలిపారు.

బంద్ను జయప్రదం చేయండి

వంగర: ఎస్సి వర్గీకరణ, క్రిమిలేయర్ విధానాన్ని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఆలిండియా నాయకత్వం పిలుపు మేరకు ఈ నెల 21న చేపట్టనున్న బంద్కు దళిత, బహుజన సంఘాల నాయకులు, మేధావులు, ఉద్యోగులు, పాత్రికేయులు, కార్మిక, కర్షక, వ్యాపార, వాణిజ్య, పాఠశాలలు, కళాశాలలు, ప్రజా సంఘాలు మద్దతు ఇవ్వాలని దళిత, బహుజన సంఘాల జెఎసి పిలుపునిచ్చింది. మండల కేంద్రంలో జెఎసి నేతలు మంగళ వారం మాట్లాడారు. ఆలిండియా దళిత, బహుజన, ప్రజా సంఘాల జెఎసి పిలుపు మేరకు బందుకు అందరూ సహకరిం చాలని కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి నశించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత, బహుజన జెఎసి నాయకులు మజ్జి గణపతి, గణపతిరావు, డర్రు రాంబాబు, శిర్లి రాజు, తిర్లంగి సింహాచలం, కొప్పర బుజ్జి. చిత్తిరి గంగులు, జెన్ని చిన్న, ఉదయ్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: ఎస్సి చేపట్టాలని సుప్రీంకోర్ట్ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ బుధవారం బంద్ నిర్వహిస్తున్నట్లు ఎస్సి వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బంద్కు సహకరించాలని ప్రవేట్ స్కూల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గట్టి పాపారావుకు మంగళవారం నాయకులు వినతి పత్రం అందించారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రవైట్ విద్యాసంస్థలు, రవాణా, వాణిజ్య, వార్తక సంస్థలు, బంద్కు సహకరించాలని పోరాట కమిటీ సభ్యులు కోరారు.

మర్రివలసలో వైద్య శిబిరం

మెరకముడిదాం: మండలంలోని గాదిల మర్రివలసలో జరిగిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విజయవం తమైంది. జి. మర్రివలస గ్రామ సర్పంచ్ దేవ, టిడిపి నాయకులు చల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో జరిగిన కంటి వైద్య సిబిరంలో 63 మంది రోగులు పాల్గొనగ ఇందులో 24మంది రోగులకు కంటి ఆపరేషన్స్ జరుగుతాయని, వారిని విజయనగరం పుష్పగిరి ఆసుపత్రికి తరలిస్తున్నామని తెలిపారు. వారికి ఉచితంగా ఆపరేషన్స్ చేయటమే కాకుండా ఉచితంగా మందులు సరఫరా కూడా చేస్తారన్నారు. మానవీయత స్వచ్ఛంద సేవా కమిటీ నిర్వా హకులు గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి హాజరైన వృద్ధులు

మొక్క నాటుతున్న సి. రవికుమార్ తదితరులు

ఆర్టిసి డిపోను సందర్శించిన ఇడి

ప్రజాశక్తి - శృంగవరపుకోట

స్థానిక ఆర్టిసి డిపోను విజయనగరం జోన్ 1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవికుమార్ మంగళవారం సందర్శించారు. ముందుగా కొత్తవలస బస్టేషన్లో సిబ్బంది కోసం 24 మందికి సరిపడేటట్లు 12 కొత్త మంచాలు, కొత్త పరుపులతో కొత్త విశ్రాంతి గదిని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎస్.కోట డిపోలో సిబ్బందిని సమావేశ పరిచి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. బస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్బంగా స్థానిక ఆర్టిసి ఎస్సిఎస్టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. డిపో మేనేజర్ కె. రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి సిహెచ్ అప్పలనారాయణ, జోన్ 1 ఎంఅండ్సి అప్పల నాయుడు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె. శ్రీనివాస్, ఆర్ఎస్డిఐ వేణు, సూపరింటెండెంట్ కృష్ణారావు, సూపర్ వైజర్లు, గ్యారేజ్, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE IV ADDITIONAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
F.D.I.A. 05/2019 : O.S. 98/2014

Between :
Karaka Anuradha ......Petitioner/Plaintiff
And :
Karaka Srinivasa Rao and others ......Respondents/Defendants
To,
R-6) Siriki Lakshmi, D/o late Karaka Satyam Dr. No. 1-74, Main Road, Near Anjaneyaswamy Temple Denkada Village & Mandal
R-7) Choppa Devi D/o late Karaka Satyam Dr. No. 1-74, Main Road Near Anjaneyaswamy Temple Denkada Village & Mandal
R-11) Koyineni Suri Babu S/o late Naram Naidu Dr. No. 4-108, Main Road Near Anjaneyaswamy Temple Denkada Village & Mandal

Where as, the above named Petitioner has instituted the above petition against you. You are hereby summoned to appear in the above Court in person or by a pleader, duly instructed and able to answer all material questions relating to the petition who shall be accompanied by some person able to answer all such questions on the **23 Day of SEPTEMBER, 2024, at 10-30 A.M.** to answer the claim and further you are hereby directed to file within 30 days of service of summons a written counter of your defence and to produce on the said day all documents in your possession or power upon which you base your defence, else the matter will be heard and determined in your absence.

By Order of the Honourable Court
I. RAMESH
Advocate for the Petitioner
Vizianagaram

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
E.P. 74/2023: O.S. 336/2020

(NOTICE UNDER ORDER 21 RULE 64 C.P.C.)
Between
Pinjala Dhaneeswari .....Decree Holder
AND:
Sirigidi Adilakshmi.....Judgment Debtor
To,
Sirigidi Adilakshmi W/o Srinivasa Rao, B.C.Colony, REDDI KANCHERU VILLAGE, Kancheru Post, Bhogapuram Mandal, Vizianagaram District

Whereas the above named Decree Holder-Plaintiff has instituted the above E.P. 74/2023 against you for Recovery of E.P. amount. You are hereby summoned to appear in this Court in person or by a pleader, duly instructed and able to answer all material questions relating to the E.P. who shall be able to answer all such questions on the **28 th Day of AUGUST, 2024, at 10-30 A.M.** to answer the claim.

By Order of the Honourable Court

Vizianagaram
Dt. 17-08-2024

I. RAMESH
ADVOCATE
K.L.PURAM
VIZIANAGARAM

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDAGE AT VIZIANAGARAM
EP 62/2019 OS 1050/2011

Between :
V.V. Kiran .....DHr/Petitioner
And :
K.Vijayalaxmi & 2 Others ....JDrs/Respondent

NOTICE

To
1. Kutcharlapati Swapna, D/o late Prasad Raju, Residing Near Vijji Stadium, Vizianagaram.
3. Kutcharlapati Sunita, D/o late Prasad Raju, Residing Near Vijji Stadium, Babametta, Vizianagaram.

Please take notice that above Honble Court ordered notice to the 2nd & 3rd Jdrs/Respondent for their appearance before the Hon'ble Court either Personally or an advocate on **03-09-2024 at 10-30 A.M.** otherwise the notice Will be dispose off in your absence.

V.A.R.Reddy
Advocate, Vizianagaram,
Cell: 924662063